క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు


విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకు పూజ, అభిషేకాలు, పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి పూజలు, పల్లకి సేవ గావించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గమళ్లపాళెంలో పశు వైద్యశిబిరం


పశువులకు చికిత్స అందిస్తున్న వైద్యుడు

ఇందుకూరుపేట : మండలంలోని గమళ్లపాళెంలో మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మురళీకృష్ణ, ఫౌండేషన్ డాక్టర్ శ్రీనివాసులు పాల్గొని పశువులకు వైద్యసేవలు అందించి అవసరమైన మందులను పాడి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ముదివర్తిపాళెం, జగదేవిపేట పశువైద్యాధికారులు హరిబాబు, నాగేంద్ర, ఎల్‌ఎస్‌ఏ రవి, గోపాలమిత్ర సలాం తదితరులు పాల్గొన్నారు.

ఇనుకుర్తిలో రీసర్వే ప్రారంభం


డ్రోన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

పొదలకూరు : మండలంలోని ఇనుకుర్తి జెడ్పీ హైస్కూల్లో భూముల రీ–సర్వేను అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూడో విడత భూముల సర్వేలో భాగంగా ఇనుకుర్తిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇనుకుర్తి మాజీ సర్పంచ్ పెదమల్లు రమణారెడ్డి, నాయకులు అక్కెం రామకోటారెడ్డి, మస్తానయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : మండలంలోని వావిళ్లలో వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో 100 యూనిట్ల పెరటి కోళ్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎం హరి మాట్లాడుతూ పెరటి కోళ్లను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీసీలు హరి, శ్యామల, వీఓఏలు దాసరి సంపూర్ణమ్మ, కృష్ణవేణి, జయమ్మ, మాధవి, లక్ష్మి, వెంకటరమణమ్మ మాధురి, నవీన పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన


మాట్లాడుతున్న జవహర్ నాలెడ్జ్ కోఆర్డినేటర్ శ్రీరామమూర్తి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : విడవలూరులోని పీఆర్‌ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత మాట్లాడుతూ లలితా జ్యూవెలర్స్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ వారు సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాలో 70 మంది యువకులు పాల్గొన్నారని, 30 మందిని ఎంపిక య్యారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ నరేంద్ర, జవహర్ నాలెడ్జ్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీరామమూర్తి, మెంటర్ ఏడుకొండలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

వెంకటాచలం : ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. అయితే బస్సు డ్రైవర్ చాకచక్యంగా నడపడంతో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ సంఘటన వెంకటాచలం మండలం రామదాసుసత్రం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి బస్సును రోడ్డు పక్కన నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను మరో బస్సులో తరలించారు. లారీ, బస్సును పోలీస్ స్టేషన్ వద్దకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటికే ‘సంపూర్ణ పోషణ’

- గర్భిణులు, బాలింతలకు వరంగా ‘వైఎస్సార్ సంపూర్ణ పోషణ’ పథకం
- ప్రతినెలా ఇంటికే వచ్చి అందించేలా చర్యలు

కోవూరు నియోజకవర్గంలో..		
అంగన్‌వాడీ కేంద్రాలు	:	242
గర్భిణులు, బాలింతలు	:	1,021
చిన్నారులు	:	3,940


గర్భిణులు, బాలింతలకు సంబంధించిన అవగాహన సదస్సులో అంగన్‌వాడీలు

కోవూరు : గర్భిణులు, బాలింతలకు వరప్రసాదినిగా ఉన్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఇంటి వద్దకే అంగన్‌వాడీల ద్వారా అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కొన్ని కారణాల వల్ల గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని పరిస్థితి నెలకొంటోంది. దీనిని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం వారి ఇళ్ల వద్దకే కిట్లను అందించే ఏర్పాట్లు చేస్తోంది. తల్లీబిడ్డ క్షేమమే లక్ష్యంగా, పౌష్టికాహారం నూరుశాతం అందజేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది. మహిళా శిశు సంక్షేమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిశు అభివృద్ధి పథకం ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్, వైఎస్సార్ పోషణ లాంటి బహత్తర పథకాలను అమలు చేస్తోంది. వీటి ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందిస్తోంది. అలాగే వైఎస్సార్ అమృతహస్తం, మధ్యాహ్న భోజన పథకం, బాలామృతం, వైఎస్సార్ బాల సంజీవిని పథకాలను అందిస్తోంది.

ప్రతినెలా..

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ప్రతినెలా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తారు. రక్తహీనతను అధిగమించడం, సరైన వ్యాయామం తదితర అంశాలపై వారికి శిక్షణ ఇచ్చి పౌష్టికాహారం తీసుకునే విధంగా అంగన్‌వాడీలు ప్రోత్సహిస్తారు. ప్రసవం జరిగి 1, 2 నెలలు గడిచిన బాలింతలు, నెలలు నిండి కేంద్రాలకు రాలేని గర్భిణులకు, ఆరోగ్యం బాగోలేక, మరే ఇతర కారణాలతో కొందరు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పౌష్టికాహాన్ని తీసుకోలేకపోతున్నారు. దీంతో వారికి కూడా పోషకాహారం అందించేలా చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తోంది.


వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్

కేంద్రాలకు అందించే పౌష్టికాహారం

వేరుశనగ, నువ్వుల చిక్కీలు, నెలకు 25 కిలోల రాగి పిండి, అరకిలో బెల్లం, గుడ్లు, మూడు కిలోల బియ్యం, కిలో పప్పు, ఐదు లీటర్ల పాలు, చిక్కీలు, అర కిలో వంట నూనె, కిలో అటుకులు, కిలో జొన్న పిండి, 250 గ్రాముల ఖర్జూరం వంటి పోషకాహారాన్ని అందిస్తారు. గర్భిణులకు పూర్తిస్థాయిలో, బాలింతలకు 6 నెలల పాటు, పిల్లలకు ఏడు నెలలు నుంచి మూడేళ్ల వరకు 2.5 కిలోల బాలామృతం అందజేస్తున్నారు. 3 నుంచి 5 ఏళ్ల పిల్లలకు పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, పాలు గుడ్లు అందిస్తున్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు చేపట్టాం. పిల్లలు ప్రతిరోజు కేంద్రానికి హాజరయ్యేలా చర్యలు తీసుకుంటూ మెనూ ప్రకారం తప్పకుండా పోషకాహారం అందజేస్తున్నాం. అంగన్‌వాడీ సెంటర్ పరిధిలోని రక్తహీనత కలిగిన గర్భిణులను గుర్తించి ఐరన్‌ఫోలిక్ మాత్రలు ఇవ్వడంతో పాటు బలవర్ధకమైన పోషక పదార్థాలు పంపిణీ చేసి వారిలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుతున్నాం.

– సౌజన్య, ఐసీడీఎస్ పీడీ

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే ప్రసన్న


మంత్రి పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న విజయ్‌కుమార్ చిత్రంలో ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం తిరుపతిలో వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. వీరి వెంట ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

బాబూ రాజేంద్రప్రసాద్‌కు నివాళి



కొడవలూరు : పన్నెండేళ్ల పాటు సుదీర్ఘకాలం రాష్ట్రపతిగా కొనసాగిన బాబూ రాజేంద్రప్రసాద్ దేశానికి అందించిన సేవలు ఎనలేనివని హెచ్‌ఎం టి.వెంకటేశ్వర్లు కొనియాడారు. మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాలలో బాబూ రాజేంద్రప్రసాద్ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త డి.స్వర్ణలత, సహాయకురాలు జి.మాధవి పాల్గొన్నారు.

శివపార్వతులకు ఏకాంత సేవ



మనుబోలు : స్థానిక బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆలయ ఆవరణలో శివపార్వతులకు ఏకాంత సేవను సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు హాజరై ఏకాంత సేవను తిలకించారు. గంధళ్ల కృష్ణయ్య–అన్నపూర్ణమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పరిశుభ్రతను పెంపొందించాలి


శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

కోవూరు : పరిశుభ్రతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ రహీమ్ తెలిపారు. కోవూరు విద్యాశాఖ కార్యాలయంలో డెటాల్ బనేగా స్వస్థ ఇండియా వారి ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. మండలంలోని 18 పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. మూడు స్థాయిల్లో పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. అనంతరం హాజరైన ఉపాధ్యాయులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌కు అభినందన


విజయకుమార్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కొడవలూరు : ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన గొల్లపల్లి విజయకుమార్‌ను వైఎస్సార్‌సీపీ మండల సేవా దళ్ అధ్యక్షుడు చక్కా మనోహర్‌బాబు నెల్లూరులోని ఆయన నివాసంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. చక్కా కుమార్ ఉన్నారు.

జగనన్న గోరుముద్దలో మంచి పోషకాలు


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొడవలూరు : ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మంచి పోషక విలువలు కలిగిన భోజనాన్ని అందిస్తున్నట్లు ఎంపీడీఓ పి.సుబ్రమణ్యం తెలిపారు. కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తరచూ మెనూలో మార్పులు తెస్తూ పోషకాలున్న ఆహారాన్నే అందిస్తోందని తెలిపారు. ఆయన వెంట హెచ్‌ఎం ఇందిరాదేవి, పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడికి గాయాలు



పొదలకూరు : పట్టణానికి సమీపంలో నెల్లూరు–పొదలకూరు మార్గం కేఆర్‌ఆర్ గార్డెన్స్ వద్ద మంగళవారం మోపెడ్‌ను పాల లారీ ఢీకొనడంతో యువకుడు గాయపడ్డాడు. ఎస్సై కరిముల్లా కథనం మేరకు.. మండలంలోని చాటగొట్ల గ్రామానికి చెందిన లోకేష్ పొదలకూరు వైపు వెళ్తుండగా ప్రమాదం సంభవించింది. లోకేష్ కాలికి గాయం కావడంతో 108లో సీహెచ్‌సీకు తరలించారు.

సీఎంకు కృతజ్ఞతలు

పొదలకూరు : తోడేరులో మృతిచెందిన యువకులకు సంబంధించి బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంపై వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయశాఖకు ప్రతిష్టాత్మకమైన పీఎస్‌యూ అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు.

మైకామైన్‌ను పరిశీలించిన ఆర్‌ఐ

పొదలకూరు : మరుపూరు గ్రామం పరిధిలోని నెల్లూరు–పొదలకూరు మెయిన్ రోడ్డుకు సమీపంలో ఉన్న సరితా మైకామైన్‌ను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నవీన్ మంగళవారం పరిశీలించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఆర్‌ఐ మైన్ వద్దకు వెళ్లారు. మైన్ లీజు గతేడాదే ముగిసినా అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆర్‌ఐ వెల్లడించారు. అయితే ఆర్‌ఐ వెళ్లే సమయానికి మైన్లో ప్రొక్లెన్ ఉండడంతో విచారణ నిర్వహించారు. యంత్రంతో పనిచేయడం లేదని డ్రైవర్ లేక యంత్రాన్ని మైన్లోనే ఉంచినట్లు అక్కడి వాచ్‌మన్ వెల్లడించాడని ఆర్‌ఐ పేర్కొన్నారు. యంత్రం పనిచేస్తుంటేనే తాము సీజ్ చేసేందుకు అధికారం ఉందన్నారు. ఈ మేరకు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

దుకాణాల వేలం రూ.19.55 లక్షలు

ఇందుకూరుపేట : గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయ ఆవరణలో దుకాణాలకు సంబంధించి వేలంపాటల్లో రూ.19.55 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ శాంతయ్య తెలిపారు. పూజ ద్రవ్యాలు, కొబ్బరి చిప్పలు, చీరలు, పూలమాలలు, హైర్స్, కూల్‌డ్రింక్స్ తదితర వాటికి మంగళవారం వేలం నిర్వహించారు. గతేడాది కంటే రూ.2,78,111 అదనంగా ఆదాయం చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, వవ్వేరు గ్రూపు దేవస్థానాల ఈఓ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

- డీఈఓ గంగా భవాని
- పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం


కోవూరు : సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న డీఈఓ గంగా భవాని


మనుబోలు : బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


పొదలకూరు : సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కోవూరు : చిన్నతనం నుంచే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి గంగా భవాని సూచించారు. మండలంలోని ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు సైన్స్ ప్రాజెక్టులను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్ సీవీ రామన్ నోబెల్ బహుమతిని స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. భౌతికశాస్త్ర రంగంలో సీవీ రామన్ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆమె వెంట హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికోన్నత పాఠశాలలో..

కోవూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటుచేసిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరి, ఎంఈఓ రహీమ్, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, పచ్చిపాల మల్లికార్జునరెడ్డి, హెచ్‌ఎం నరసింహామూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవ ప్రగతికి సైన్సే పునాది

మనుబోలు : మానవ ప్రగతికి సైన్సే పునాది అని, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు సైన్స్‌ఫెయిర్‌లు ఉపయోగపడుతాయని హెచ్‌ఎం డేవిడ్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మనుబోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్‌ఫెయిర్‌ను నిర్వహించారు. ముందుగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఆలోచనలకు పదునుపెట్టి శాస్త్ర సాంకేతిక రంగాల్లో విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు సైన్స్‌ఫెయిర్‌లు దోహదపడుతాయన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులు ప్రశ్నించే, శోధించే తత్వాన్ని అలవరచుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా సైన్స్ ప్రదర్శనల్లో మెరుగైన వాటికి బహుమతులు, సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాంతారావు, రాధయ్య, కామేశ్వరి, షావలి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో..

వెంకటాచలం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వెంకటాచలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. వీటిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాట్లూరు సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం లత, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

- గొలగమూడిలోని ప్రభుత్వ ఆశ్రమ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.లక్ష్మీకామేశ్వరి పాల్గొన్నారు.

డీఎన్నార్‌లో..

పొదలకూరు : పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలుర హైస్కూల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సీవీ రామన్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం వై.అనిల్‌కుమార్ చేతుల మీదుగా వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలు అబ్బురపరిచాయి. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలను పారదోలేందుకు మ్యాజిక్‌షోను నిర్వహించారు. క్విజ్‌పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల నుంచి ఎంపిక చేసిన నాలుగు ఉత్తమ ప్రదర్శనకు క్రియ వైజ్ఞానిక సంస్థ ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ వేణుగోపాల్, చక్రపాణి, శివకుమార్, డాక్టర్ బాలు, మెజీషియన్ చైతన్య, సైన్స్ టీచర్లు కృష్ణయ్య, వాణి, లక్ష్మీకుమారి, ఏవీ సుధాకర్ పాల్గొన్నారు.

తాటిపర్తిలో..

మండలంలోని తాటిపర్తి ప్రాథమిక(ఎస్సీ) పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగమోహన్‌రెడ్డి సైన్స్ ప్రదర్శనలు ప్రారంభించారు. పీసీ చైర్మన్ రాజేష్, హెచ్‌ఎం జి.శ్రీనివాసులు, ఉపాధ్యాయిని పి.అరుణ, సీఆర్పీ ఏడుకొండలు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనలతో సృజనాత్మకత మెరుగు

కొడవలూరు : విజ్ఞాన ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లోని సృజనాత్మకత మెరుగు పడుతుందని ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు. జాతీయ సైన్స్ డే సందర్భంగా మండలంలోని రామాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అబ్బుర పరిచే విజ్ఞాన నమూనాలు రూపకల్పన చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.ఐజయ్య, ఉపాధ్యాయులు జి.శ్రీనివాసులు, పెంచలయ్య, యశోదమ్మ, యామిని పాల్గొన్నారు.

- ముత్తుకూరు : మండలంలోని జెడ్పీ హైస్కూళ్లు, యూపీస్కూళ్లలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను తెలియజేసే వివిధ నమూనాలను ప్రదర్శించారు. ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్‌లో వాయు కాలుష్యం నివారణకు సంబంధించి విద్యార్థులు తయారు చేసిన నమూనా ఉపాధ్యాయులను ఆకట్టుకుంది. వేసవి తాపాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్‌లో ప్రాజెక్టుల పనితీరు, అగ్నిపర్వత ప్రభావం, శరీరంలోని వివిధ భాగాల విధులు తదితర నమూనాలను ప్రదర్శించారు.
- తోటపల్లిగూడూరు : మండలంలోని చెన్నపల్లిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రూప, ఉపాధ్యాయులు ఫణికుమార్, మురళీ, సులోచనమ్మ, విద్యాధరి, జయలత పాల్గొన్నారు.
- సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం జరిగింది. ఈ క్రమంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెరుకూరు సరళకుమారి, ఉపాధ్యాయులు షేక్ అహ్మద్‌బాషా, వసంతలక్ష్మి, సుభాషిణి పాల్గొన్నారు.
- బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సైన్స్ డేను నిర్వహించారు. విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. తొలుత సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు.


ముత్తుకూరు హైస్కూల్‌లో వాయు కాలుష్య నివారణకు సంబంధించిన ప్రదర్శన


ముత్తుకూరు : సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్‌లో..


బుచ్చిరెడ్డిపాళెం: ప్రదర్శనకు ఉంచిన ప్రాజెక్టులు


వెంకటాచలంలో సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న అధికారులు, నాయకులు


వెంకటాచలం : గొలగమూడి గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో..


కొడవలూరు : సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ వసంతకుమారి


పొదలకూరు : తాటిపర్తి పాఠశాలలో..


తోటపల్లిగూడూరు : సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో..